


అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న వేరుశనగ రైతులు

# కర్షకుడి కడుపుమంట

- కట్టలు తెంచుకున్న రైతన్నల ఆగ్రహం
- ట్రేడర్లు కుమ్మక్కై ధర తగ్గిస్తున్నారంటూ మండిపాటు
- అచ్చంపేట వ్యవసాయ కార్యాలయం ముట్టడి
- ఫర్నిచర్ ధ్వంసం
- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌పై అమానుషంగా దాడి
- లాక్కెళ్లి రాస్తారోకో చేపట్టిన మహిళా రైతులు
- రీటెండర్లు వేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమణ
- దాడికి నిరసనగా నేడు కొనుగోళ్లు బంద్..

అచ్చంపేట, ఫిబ్రవరి 11 : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివా రం మరోసారి వేరుశనగ రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. పల్లికి ట్రేడర్లు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. అచ్చంపేట మార్కెట్‌కు ఆదివారం 709మంది రైతులు 32,875 బస్తాల (8,218.75 క్వింటాళ్లు) వేరుశనగ తీసుకొచ్చారు. కాగా ధర క్వింటాకు గరిష్ఠంగా రూ.7,060, కనిష్ఠంగా రూ. 4,816, మధ్యస్తంగా రూ. 6,510గా నిర్ణయించారు. ఈ ధరలను చూసిన రైతులు ఆగ్రహంతో ఊగిపోయా రు. ట్రేడర్లు కుమ్మక్కై తక్కువ ధర నిర్ణయిస్తున్నారని, శాంపిల్ తీసుకెళ్లకుండా చేతులతో చూసి ధర నిర్ణయిస్తున్నారని ఆరోపించారు. రైతులను అడుగడుగునా మోసం చేస్తున్నారంటూ సెక్రటరీ కార్యాలయాన్ని చుట్టుముట్టి గిట్టుబాటు ధర కల్పించాలని నినాదాలు చేశారు.



చైర్‌పర్సన్ చాంబర్‌లో ధ్వంసమైన ఫర్నిచర్

**మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌పై దాడి..**

మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తలుపు అద్దాలు పగులగొట్టి, కుర్చీలు, టేబుల్‌ను కిందపడేశారు. చైర్‌పర్సన్ అరుణను కొందరు మహిళా రైతులు చీరపట్టి లాగి, కింద కూర్చున్న ఆమెపై దాడికి పాల్పడ్డారు. మార్కెట్ నుంచి చైర్‌పర్సన్ చీర పట్టుకొని అంబేద్కర్ చౌరస్తా వరకు లాక్కొని వచ్చారు. చౌరస్తా వద్ద చైర్‌పర్సన్‌ను నిర్బంధించి ఆమె తలపై వేరుశనగ పోసి ఆందోళన చేపట్టగా సాయంత్రం వరకు ఆందోళన కొనసాగింది. ప్రభుత్వం వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా తమకు అన్యాయం చేస్తున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నోట్లో మట్టికొడుతున్న ట్రేడర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు ఎస్సై, పోలీసులు జోక్యం చేసుకొని రీ టెండర్లు వేయిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, చైర్‌పర్సన్‌పై జరిగిన దాడిని పలువురు ఖండించారు. చైర్‌పర్సన్‌పై కొందరు రైతులు కావాలనే దాడికి పాల్పడ్డారని బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ పేర్కొన్నారు. రైతులే దాడి చేశారా? లేక వారిని రెచ్చగొట్టి దాడి చేయించారా? అనే విషయాన్ని పోలీసులు విచారణ చేసి తెలుసుకోవాలని కోరారు.



చైర్‌పర్సన్‌ను నిర్బంధించిన రైతులు

### పీఎస్‌లో చైర్‌పర్సన్ ఫిర్యాదు

తనపై దాడి చేసి భయాందోళకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అరుణ అచ్చంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ధరల గురించి మార్కెట్ సెక్రటరీ, ట్రేడర్లు చూసుకోవాలి కానీ.. తనను నిర్బంధించి దాడిచేయడం సరైంది కాదన్నారు. ధరలతో తనకు సంబంధం ఉండదని, ట్రేడర్లతో అందరం కలిసి మరోసారి మాట్లాడుదామని చెబుతున్నా వినకుండా దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. చైర్‌పర్సన్‌పై దాడిని ఆర్యవైశ్య సంఘం, కిరాణా వ్యాపారస్తులు ఖండించారు. దాడికి నిరసనగా సోమవారం మార్కెట్ బంద్ చేస్తున్నట్లు వ్యాపారస్తులు తెలిపారు.



వనపర్తి జిల్లాలోని రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

# లెక్క తేలలే..!

- రైస్ మిల్లుల్లో విజిలెన్స్, ప్రత్యేక అధికారుల తనిఖీ

వనపర్తి, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం నుంచి వడ్లను తీసుకొని ధాన్యం చేసి ఇవ్వాల్సిన పలు రైస్ మిల్లులు మూడేండ్లుగా అలసత్వం వహిస్తున్నాయి. అలాంటి వాటిపై సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. గత నెలలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సీఎంఆర్ ధాన్యం సేకరణపై ఆరా తీసి లోపాలను గుర్తించారు. ఈ క్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిపై బదిలీ వేటు పడింది. రైస్ మిల్లర్లు, రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులతో పలుమార్లు సమావేశం నిర్వహించారు. గడువులోగా ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యాన్ని వెంటనే ఇవ్వాలని, లేని పక్షంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. దీంతో రైస్ మిల్లర్లు బియ్యం అప్పగించే పనులు షురూ చేశారు. గతేడాది డిసెంబర్ 31 నాటికి ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యం 3,570 ఏసీకేలుండగా, మిల్లర్లు జనవరిలో 940 ఏసీకేల బియ్యాన్ని ఇచ్చారు. అదేవిధంగా ఫిబ్రవరి చివరి వరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బియ్యాన్ని పూర్తిస్థాయిలో పెట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

**జిల్లాలో ప్రత్యేక తనిఖీలు..**

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైస్ మిల్లుల్లో చీఫ్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఐదు మిల్లుల్లో ప్రత్యేక బృందం గతంలో తనిఖీలు చేపట్టింది. కొత్తకోట మండలం మిరాసిపల్లి పరిధిలోని ఇషాన్ ట్రేడర్స్, పాన్‌గల్ మండలం మహ్మదాపురంలో మీనాక్షి ఫుడ్ ప్రొడక్షన్, వనపర్తిలోని కేదర్‌నాథ్ రైస్‌మిల్, పాన్‌గల్ పరిధిలోని ఇషాన్ ఆగ్రో, పరమేశ్వర రైస్‌మిల్లులపై గత నెలలో పౌరసరఫరాల శాఖ కేసులు నమోదు చేసింది. కేంద్ర ఆహార సంస్థకు బియ్యం పెట్టకపోవడంతోపాటు మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం బస్తాల లెక్కల్లో భారీ తేడాను అధికారులు గుర్తించారు. దాదాపు 2,25,179 బస్తాల ధాన్యం లోటు ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. అయితే ఇందుకు అంగీకరించని ఓ యజమాని రాష్ట్ర అడ్వకేట్ కౌన్సిల్‌ను ఆశ్రయించి ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఈ తతంగంపై రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్, ప్రధాన విజిలెన్స్ అధికారి ప్రకాశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మళ్లీ తనిఖీ చేస్తున్నది. ఇందులో ప్రధానంగా ధాన్యం బస్తాలను లెక్కించడం ద్వారా ఎంతమేర లోటు ఉందనే స్పష్టత రానున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్ వెల్లడించారు.



దుప్పల్లిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# ‘చలో నల్లగొండ’ను విజయవంతం చేద్దాం

- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపు

మదనాపురం, ఫిబ్రవరి 11 : చలో నల్లగొండ సభను విజయవంతం చేద్దామని బీఆర్‌ఎస్ కార్యకర్తలకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని దుప్పల్లిలో ఆదివారం పలు శుభకార్యాలకు హాజరై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదిపై తెలంగాణ ప్రాజెక్టులు, నీటి హక్కులను హరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్ర సంస్థ కేఆర్‌ఎంబీకి అధికారమివ్వడం ద్వారా జరుగబోయే దుష్పరిణామాలను ఖండిస్తూ, తెలంగాణ సమాజానికి వివరించేందుకు నల్లగొండలో 13న బహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇటిక్యాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రీజినల్ కోఆర్డినేటర్ ఫ్లారెన్స్‌రాణి

# గురుకుల ప్రవేశ పరీక్షకు 94.4 శాతం హాజరు

పాలమూరు, ఫిబ్రవరి 11 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురుకుల 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు తెలంగాణ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఫ్లారెన్స్‌రాణి తెలిపారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, ఇటిక్యాల, నారాయణపేటలో నిర్వహించిన పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 10,683 మంది విద్యార్థులకు గానూ 10,046 మంది (94.9%) హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డిప్యూటీ సెక్రటరీ రాజేశ్వరి కూడా తనిఖీ చేశారు.

# చిరుత కలకలం?

- దామరగిద్ద వాసుల భయాందోళన

దామరగిద్ద, ఫిబ్రవరి 11 : మండలకేంద్రంలో చిరుత సంచరిస్తుండదనే అనుమానంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రానికి చెందిన గడ్డమీది అంజప్ప రోజు మాదిరిగానే శనివారం తన పొలం వద్ద ఆవు, దూడను కట్టేసి ఇంటికొచ్చాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లే సరికి దూడను ఏదో గుర్తు తెలియని జంతువు తిన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. ఏఎస్సై అరుణ్ ఇచ్చిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారి లక్ష్మణ్ అక్కడికి వచ్చి అనుమానిత ప్రదేశాన్ని పరిశీలించారు. అడుగుజాడల నమూనాలను సేకరించి పరిశీలకు పంపించామని, 15 రోజుల తర్వాత పూర్తి స మాచారం ఇస్తామని చెప్పారు. దూడలను కొన్ని రోజుల వరకు ఇంటి వద్దే ఉంచుకోవాలని, రైతులు పొలానికి వెళ్లేటప్పుడు ఆత్మరక్షణ కోసం చేతికర్రను తీసుకెళ్లాలని సూచించారు.

## జోగుళాంబ ఆలయంలో విశేష పూజలు

అలంపూర్, ఫిబ్రవరి 11 : అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. చండీహోమాలు, పవమాన సూక్త పారాయణ హోమాలు, మండపారాధన, బలిహరణ ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున నుంచే అమ్మవారిని దర్శించుకొని తన్మయత్వం చెందారు. జోగుళాంబ యాగశాలలో చండీ హోమాలు కొనసాగాయి. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, ఖడ్గమాల, త్రిశతి అర్చన వంటి తదితర పూజలు చేపట్టారు.

**ఒక్క రైతుకు మూడు రకాల ధరలు!**

చారకొండ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు దాదాపు 100 కింటాళ్ల వేరుశనగను మార్కెట్‌కు తీసుకొచ్చాడు. ఒకే చోట పోయడానికి వీలులేక మూడు చోట్ల కుప్పలు పోశాడు. దీంతో వ్యాపారులు సైతం శ్రీనివాసులు తీసుకొచ్చిన వేరుశనగకు మూడు కుప్పలకు మూడు రకాలుగా ధర నిర్ణయిస్తూ టెండర్ వేశారు. ఒక కుప్పకు రూ.6,216, రెండో కుప్పకు రూ.5,215, మూడో కుప్పకు రూ.5,075గా ధర నిర్ణయించడంతో రైతు ఆశ్యర్యపోయాడు. ఒక పొలంలో ఒకే విత్తనంతో సాగుచేయగా వచ్చిన దిగుబడికి మూడు రకాల ధరలేంటని ఆందోళనకు దిగాడు. ఇందులో మోసం ఉందంటూ వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా రైతులకు సైతం ధర విషయంలో ఇలాగే జరుగడంతో ఆందోళన మొదలైంది. మార్కెట్‌కు వేరుశనగ ఎక్కువ వస్తుండడంతో వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. మార్కెట్ కార్యదర్శి వ్యాపారులతో కలిశాడని, ఫలితంగానే నెల వ్యవధిలో రూ.2వేల వరకు ధర తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీల కూలి తగ్గదు, వ్యాపారుల కమీషన్ తగ్గదు కానీ.. పంటకు మాత్రం ధర ఎందుకు తగ్గుతుందని ప్రశ్నించారు.

**మళ్లీ మొదటికొచ్చింది..**

రాత్రి 8 గంటలకు వ్యాపారులతో చర్చలు జరగగా.. రైతులు ఆందోళన విరమించారు. టెండర్‌లలో వచ్చిన కనిష్ఠ ధరకు అదనంగా రూ.400, మధ్యస్త ధరకు రూ.150, గరిష్ఠ ధరకు రూ.75 ఎక్కువ చెల్లిస్తామని వ్యాపారులు చెప్పడంతో రైతులు అసంతృప్తితోనే ఒప్పుకొన్నారు. అయితే, ధర విషయంలో వ్యాపారులు సానుకూలంగా ఉన్నారని మార్కెట్ అధికారులు మైక్‌లో ప్రకటించిన కొద్దిసేపటికే కథ మళ్లీ మొదటికొచ్చింది. పెంచిన ధరలను మార్కెట్ అధికారులు టెండర్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వ్యాపారులు అనడంతో పరిస్థితి మొదటికొచ్చింది. అధికారులు ప్రకటించిన అదనపు ధరలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే.. ఆ ధరను మార్కెట్ శాఖ ఇవ్వాల్సి వస్తుంది. ఇదంతా జరిగే పని కాదు. కాగా, సోమవారం మార్కెట్‌లో ఉన్న వేరుశనగకు మళ్లీ టెండర్ వేయాల్సిందే. ఇదిలా ఉంటే రైతులు మాత్రం వేరుశనగ కుప్పల వద్ద దుప్పట్లు కప్పుకొని కాపలా కాస్తున్నారు.

# అన్నదాత ఆగ్రహజ్వాల

- సిండికేట్‌గా మారి మోసం చేస్తున్న వ్యాపారస్తులు
- మార్కెట్ కార్యదర్శి కుమ్మక్కయ్యాడంటూ ఆవేదన
- మద్దతు ధర కోసం రోడ్డెక్కిన వేరుశనగ రైతాంగం
- కల్వకుర్తిలోని హైదరాబాద్ చౌరస్తాలో ధర్నా



కల్వకుర్తిలోని రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 : వ్యాపారులు సిండికేట్‌గా మారి వేరుశనగకు తక్కువ ధర ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో రైతులు ధర్నాకు దిగారు. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు రైతులు ఆదివారం 12వేలకు పైగా వేరుశనగ బస్తాలను తీసుకొచ్చారు. కాగా వ్యాపారులు రహస్య టెండర్ విధానంలో ధర అత్యధికంగా రూ.7,040, మధ్యస్తంగా రూ.6,100, అత్యల్పంగా రూ.4,806 నిర్ణయించారు. గరిష్ఠ ధరను ఒకట్రెండు క్వింటాళ్ల వేరుశనగకు నిర్ణయించి, ఎక్కువ బస్తాలకు రూ.4800 నుంచి రూ.5,500 ధర నిర్ణయించడంతో రైతులు భగ్గుమన్నారు. నెల వ్యవధిలో రూ.2వేల ధర తగ్గిందని ఆందోళనకు దిగారు. సింగికేట్‌గా మారి తమను నిలువునా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ వ్యాపారులతో వాదనకు దిగారు. మార్కెట్ లేదని వ్యాపారులు సమాధానమివ్వడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ర్యాలీగా వెళ్లి మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న హైదరాబాద్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగతాయని నచ్చజెప్పారు. మార్కెట్ కార్యదర్శి, వ్యాపారులతో చర్చిద్దామని చెప్పి రైతులను మార్కెట్ యార్డుకు తీసుకెళ్లారు. కొంతమంది రైతులు, పోలీస్ అధికారులు కలిసి మార్కెట్ కార్యదర్శి, వ్యాపారులతో చర్చించారు. ధర పెంచే విషయంలో వ్యాపారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో అనుమానం మొదలైంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ఉద్దేశపూర్వకంగానే ధర తగ్గించారని, రోజురోజుకూ ధర తగ్గుతూ పోతే మా బతుకులెట్లా.. ఏదైతే అదైతదంటూ మళ్లీ హైదరాబాద్ చౌరాస్తాలో రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అక్కడికి చేరుకొని రైతులకు మద్దతు తెలుపగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే కల్వకుర్తి డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకోగా రైతులు ప్రభుత్వం, వ్యాపారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మార్కెట్ కార్యదర్శి వ్యాపారులకు తొత్తుగా పనిచేస్తున్నాడని మండిపడ్డారు. గిట్టుబాటు ధర కల్పించే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు నచ్చజెప్పేందుకు యత్నించినా గంట పాటు రాస్తారోకో కొనసాగింది. చెప్పేది వినకుండా మొండికేస్తే.. ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేసులు నమోదు చేస్తామని.. గిట్టుబాటు ధర కావాలంటే వ్యాపారులతో మాట్లాడాలి.. అందుకు మేం సహకరిస్తామని సీఐ చెప్పి రైతులను మార్కెట్ యార్డులోకి తీసుకెళ్లారు. కొంతమంది రైతులు, వ్యాపారులు, మార్కెట్ కార్యదర్శితో మద్దతు ధర విషయమై మాట్లాడుతున్నా.. మిగతా రైతులు మాత్రం మార్కెట్ కార్యాలయం ఎదుట తమ ఆందోళనను కొనసాగించారు.



వేరుశనగ కుప్పల వద్దే నిద్రిస్తున్న రైతన్నలు

# మట్టిరోడ్లకు సీసీ సొబగులు

- ఉపాధి హామీ కింద కాలనీలకు కొత్త మెరుగులు
- గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలు
- వనపర్తి జిల్లాలో రూ.29.27 కోట్లతో 716 పనులు..
- మార్చి నెల లక్ష్యంగా కార్యాచరణ

వనపర్తి, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : పల్లెల్లోని మట్టి రోడ్ల రూపురేఖలు మారనున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో మట్టి రోడ్ల ఇబ్బందులను తొలగించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం చివరలో చర్యలు తీసుకుంటున్నది. జిల్లాలో రూ.29.27 కోట్లతో 716 పనులను పంచాయతీరాజ్, ఉపాధి హామీ శాఖల ఆధ్వర్యంలో పనులను గుర్తించారు. ఇందులో 90 శాతం నిధులు ఉపాధి హామీ పథకం ద్వారా సమకూరుతుండగా, మరో 10 శాతం నిధులు ప్రజాప్రతినిధుల కోటా నుంచి సమకూరుతాయి. పల్లె ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో శాశ్వత పనులు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా పల్లెల్లో అధ్వానంగా ఉండే మట్టి రోడ్లను పూర్తిగా మార్పు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మట్టిరోడ్ల వివరాలు సేకరించి వీటన్నింటినీ మండలాలు, నియోజకవర్గాల వారీగా క్రోడీకరించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా ఈ ప్రతిపాదనలను సిద్ధం చేశాయి.



వీపనగండ్లలో సీసీగా మారనున్న మట్టిరోడ్డు

జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీలు ఉండగా వీటితోపాటు అనేక అనుబంధ గ్రామాలున్నాయి. ప్రస్తుతం పల్లెల్లో ఉన్న మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చనున్నారు.

**ఏ మండలానికి ఎన్ని రోడ్లు..**

జిల్లాలోని 14 మండలాల వారీగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పరిధిలో సీసీ రోడ్లను మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా చూస్తే.. వనపర్తి మండలానికి 42 పనులకు గానూ రూ. 2.46 కోట్లు, అలాగే పెబ్బేరు మండలానికి 42 పనులకు రూ.2.07 కోట్లు, శ్రీరంగాపురం మండలానికి 27 పనులకు రూ.1.35 కోట్లు, గోపాల్‌పేట్‌లో 42 పనులకు రూ.2.38 కోట్లు, రేవల్లిలో 19 పనులకు రూ.1.31 కోట్లు మంజూరయ్యాయి. అలాగే పాన్‌గల్ మండలానికి 98 పనులకు గానూ రూ.3.10 కోట్లు, వీపనగండ్ల మండలానికి 55 పనులకు రూ.1.70 కోట్లు, చిన్నంబాయిలో 44 పనులకు రూ.1.80 కోట్లు, ఆత్మకూరులో 37 పనులకు రూ.1.40 కోట్లు, అమరచింత, పెద్దమందడి మండలాల్లో 56 పనులకు రూ.2.50 కోట్లు, ఖిల్లాఘణపురంలో 56 పనులకు రూ.2.68 కోట్లు, కొత్తకోట, మదనాపురం మండలాల్లో 71 పనులకు రూ. 2.43 కోట్లు మంజూరయ్యాయి.

**గ్రామాల్లో సీసీ రోడ్ల సందడి..**

జిల్లాలోని పల్లె గ్రామాలకు సీసీ రోడ్డు పనులు మంజూరు కావడంతో నిర్మాణాల సందడి మొదలైంది. గతంలో మిగిలిన రోడ్లను ఈ దఫాలో సీసీ రోడ్లుగా మార్చనున్నారు. అయితే, నెమ్మదిగా మొదలవుతున్న పనులను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉన్నది. గతంలో చేపట్టిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీసీ రోడ్లు పల్లెల్లో కొత్తదనాన్ని ఇస్తున్నాయి. ఎప్పుడు మురికిగా కనిపించే గ్రామాల కాలనీల రోడ్లు సీసీ రోడ్లతో అందంగా కనిపిస్తున్నాయి. వీటికి తోడు మురికి కాల్వల నిర్మాణాలను చేపడుతుండటంతో గ్రామాల పరిసరాలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

**గడువులోగా పూర్తి చేయిస్తాం..**

ఏటా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఆర్థిక సంవత్సరం చివరలో సిమెంట్ రోడ్లు మంజూరవుతాయి. ఈ ఏడాది కూడా జిల్లాలో రూ.29.27 కోట్లతో 680 పనులు మంజూరయ్యాయి. వీటన్నింటినీ గడువులోగా పూర్తి చేయిస్తాం. పనులను నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. గడువులోగా పనులు చేయని పక్షంలో పనులు రద్దయ్యే అవకాశం ఉంటుంది.

*- మల్లయ్య, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ*